సచివాలయం.. సేవలు సమస్తం


పందలపాకలో సచివాలయ భవనం

- ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

బిక్కవోలు: పథకాలు పొందాలంటే గతంలోలా ఉరుకులు, పరుగులు తియ్యాల్సిన అవసరం లేదు.. అందరి చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పనిలేదు.. అర్హత ఉంటే చాలు అవే ఇంటి ముంగిటకు చేరుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో అది సాధ్యమైంది. తద్వారా ప్రజలకు అవసరమైన సేవలన్నీ పూర్తి స్థాయిలో అందుతున్నాయి. తద్వారా ప్రతి పనికీ మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని తప్పింది. అవస్థ తీరింది. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున ఏర్పాటు చేశారు. ఆయా సచివాలయాల్లో పది నుంచి 12 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులను నియమించారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. మండలంలోని


పందలపాక సచివాలయంలో సేవలందిస్తున్న సిబ్బంది

బిక్కవోలులో 4, బలభద్రపురం 3, కొమరిపాలెం 2, పందలపాక 2, ఊలపల్లి 2, కొంకుదురు 2, రంగాపురం, తొస్సిపూడి, కాపవరం, ఇలపల్లి, ఆరికరేవుల, మెళ్లూరులో ఒకొక్కటి చొప్పున మొత్తం 21 సచివాలయాలను ఏర్పాటు చేశారు. వీటిలో 147 సచివాలయ సిబ్బంది ఉండగా, 438 మంది వలంటీర్లతో సేవలు అందిస్తున్నారు. మొత్తం 512 సేవలతో పాటు ఆధార్ తదితర వాటికి సంబంధించిన సేవలు అందుతున్నాయి. అలాగే 2022 జనవరి 1 నుంచి 2023 ఆగస్టు 31 వరకూ మండలంలో 1,17,575 సేవలను సచివాలయాల ద్వారా ప్రజలు పొందారు. ఇందులో పందలపాక సచివాలయం-1 ముందు వరుసలో నిలిచింది.

వెంటనే స్పందిస్తూ..

లబ్ధిదారులకు పథకాలు సకాలంలో అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీనిద్వారా పాలనను పల్లె ముంగిటకే తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే ఆయా సచివాలయాల పరిధిలో వలంటీర్ వ్యవస్థ కీలకంగా పనిచేస్తుంది. వలంటీర్లే ప్రజల ఇంటి ముంగిటకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు అర్హులకు అందజేస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, తదితర పింఛదారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికి వచ్చి పింఛన్ల సొమ్ము పంపిణీ చేస్తున్నారు.

ఎంతో ఉపయోగం



మాది పందలపాక సచివాలయం-1 పరిధి. గతంలో ఏ పని కావాలన్నా అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం వలంటీర్ గొర్రిపోటి మమత ఇంటికి వచ్చి పథకాలు అందిస్తుంది. పింఛన్లతో పాటు ధ్రువపత్రాలు అందించడం, విద్యుత్తు బిల్లులు కట్టించుకుంటుంది. మాలాంటి వృద్ధులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరం.

–వర్రి అప్పాయ్యమ్మ, పందలపాక

అతి తక్కువ సమయంలోనే..



నేను పందలపాకలో నివాసం ఉంటున్నాను. నా భర్త మరణించారు. ఈ మధ్య కాలంలోనే హైదరాబాద్ నుంచి వచ్చాం. రైస్‌కార్డు, పింఛన్ కోసం ఎక్కడి వెళ్లాలా అని భయపడ్డాను. సచివాలయానికి వెళ్లి అడగ్గా సిబ్బంది మాటలకు కొండంత ధైర్యం వచ్చింది. అతి తక్కువ సమయంలో రైస్‌కార్డు, పింఛను అందించారు.

–యాసలపు చిట్టెమ్మ, పందలపాక

కళ్లలో ఆనందం చూస్తున్నాం..



నేను సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. ఎంతో మంది వివిధ సమస్యలపై సచివాలయానికి వస్తున్నారు. ప్రభుత్వం మా ద్వారా సమస్యల పరిష్కారం పరిష్కరిస్తుండడంతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూస్తున్నాం. ఇది మాకు సంతృప్తిని ఇస్తుంది. మండల స్థాయిలో మా సచివాలయం అత్యధిక సమస్యలను పరిష్కరించింది.

–సూరిశెట్టి సురేష్, డిజిటల్ అసిస్టెంట్, పందలపాక సచివాలయం-1

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

రాజానగరం: మండలంలోని కొత్తతుంగపాడులో హితకారిణి సమాజానికి చెందిన భూములలో నిర్మించిన ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. సర్వే నంబర్ 850లోని 4.79 ఎకరాలను 37 మంది పేదలు ఆక్రమించుకుని, పూరిగుడిసెలు నిర్మించుకున్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సోమరాజు, కమిషనర్ కె.విజయలక్ష్మి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ మునికుమారిల సమక్షంలో జేసీబీ సాయంతో ఆ పూరిగుడిసెలను నేలమట్టం చేశారు. ఈ సమయంలో కొన్ని కుటుంబాల వారు స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు తమకు రెండు రోజుల వ్యవధి కావాలని కోరడంతో మునికుమారి అందుకు అంగీకరించారు. సోమవారం మళ్లీ వస్తామని, అప్పటికి ఆక్రమణలన్నింటినీ తొలగించాలని, లేకుంటే ప్రభుత్వ నిబంధనలను అనుసరించి తామే వాటిని కూల్చివేస్తామన్నారు. హితకారిణి సమాజానికి చెందిన ఆస్తుల పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇనస్పెక్టర్లు ప్రసాద్, విఘ్నేశ్వరస్వామి, ఈఓలు నాగసురేష్, దొరబాబు, వీహెచ్‌వీఆర్ మూర్తి, లక్ష్మీభాయి, సత్యవేణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


బిక్కవోలులో సాయిబాబా వారు

బిక్కవోలు: స్థానిక శ్రీకోదండ రామాలయం వద్ద సాయిబాబా ఆలయ రెండో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి పల్లకిపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దివంగత గేదె శ్రీరామమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారుడు వైజాగ్ అబ్బు, భక్తుల సహకారంతో ఏర్పాటైన అన్న సమారాధనను ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్‌రెడ్డి, పాలచర్ల రామకృష్ణా చౌదరి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యం


వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్‌ను పంపిణీ చేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రామవరంలోని 153వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో కిట్లతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందుతుందన్నారు. అనంతరం టేక్ హోం రేషన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ నందీశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెరుగుదలకు చర్యలు


సింగంపల్లిలో రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను పరిశీలిస్తున్న జగదాంబ తదితరులు

రంగంపేట: రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌తో భూగర్భ జలాలు పెరుగుతాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు పి.జగదాంబ అన్నారు. సింగంపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వద్ద జరుగుతున్న రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జగదాంబ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద వర్షపు నీటిని భూమిలోకి ఇంకే విధంగా ఈ నిర్మాణాలు చేస్తున్నామన్నారు. దీనివల్ల ఆయా కార్యాలయాల వద్ద బోర్లు రీచార్జి అవుతాయన్నారు. సింగంపల్లి సొసైటీ భవనం ఆవరణలో, రైతుభరోసా కేంద్రం ఆవరణలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఏపీడీ జి.శ్రీనివాస్, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతుల సంక్షేమానికి కృషి

పెదపూడి: కౌలు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. శుక్రవారం పెదపూడిలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో భాగంగా మొదటి విడతగా మండలంలో 480 మంది కౌలు రైతులకు రూ.36 లక్షలను వారి ఖాతాల్లో చేశారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలోనే రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు.

ఘనంగా ఎల్ఐసీ ఆవిర్భావ వారోత్సవాలు

గోకవరం: ఎల్ఐసీ 67వ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం గోకవరంలో బ్రాంచి మేనేజర్ కె. విద్యాసాగర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఎలిపే శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మొక్కలు నాటడం, విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలు, ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు సన్మానాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రసన్న కుమార్, స్వరాజ్యలక్ష్మి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

కొత్త పింఛన్ల పంపిణీ


రంగాపురంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ వీరభద్రరావు


కోరుకొండలో లబ్ధిదారుడికి పింఛను అందజేస్తున్న వలంటీరు

బిక్కవోలు: రంగాపురం గ్రామంలోని కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ గండికోట వీరభద్రరావు శుక్రవారం పంపిణీ చేశారు. అక్కడి సచివాలయం వద్ద ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ ఎలాంటి సిఫార్సులు లేకుండా పింఛన్లు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఉద్యానవన గ్రామ సహాయకుడు సత్యనారాయణ, వీఆర్వో సుబ్బారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

221 మందికి మంజూరు

పెదపూడి: మండలంలో కొత్తగా 221 మందికి సామాజిక పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. మండలంలో 10,243 మందికి పింఛన్లు పంపిణీ చేస్తుండగా, అదనంగా మరో 221 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నామన్నారు. శుక్రవారం మండలంలో మొత్తం 75 శాతం మందికి పింఛన్లు అందజేశామన్నారు.

బిక్కవోలు: మండలంలో తొలిరోజు 80 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. మొత్తం 10,589 పింఛనుదారులకుగాను 8,555 మందికి అందించామన్నారు.

612 మందికి కొత్తగా..

సీతానగరం: మండలంలో ఈ నెలలో 612 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వాటిలో 234 కొత్త పింఛన్లకు నగదు అందించామని, మిగిలిన 378 కొత్త పింఛన్లపై పరిశీలన జరుపుతున్నారని, వీరికి మూడు రోజుల్లో నగదు అందిస్తారన్నారు. గత నెలలో మండల గ్రామాల్లో 11,301 మందికి పింఛన్లు అందించామన్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు 11,479 మందికి పింఛను అందించామని ఆయన తెలిపారు.

వేకువ జాము నుంచీ..

మధురపూడి: కోరుకొండ మండలంలోని 22 గ్రామాల్లో శుక్రవారం వేకువ జాము నుంచీ నుంచి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో పాత పెన్షన్ దారులు 9,452 మంది ఉండగా, కొత్తగా మరో 2,569 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. శుక్రవారం 80 శాతం మందికి పంపిణీ చేశారు.

అభివృద్ధి ఫలాలు అందరికీ

- రూ.3 కోట్లతో కాపవరం గ్రామాభివృద్ధి
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రాజా


కాపవరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: అభివృద్ధి ఫలాలు అందరికీ చేరాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. తొలుత స్థానిక అమ్మవారిని దర్శించుకున్న ఆయన సచివాలయం సమీపంలో గడప గడపకూ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొత్తగా మంజూరయిన పెన్షన్లు, రేషన్‌కార్డులను ఈ నెల 5 వతేదీన లబ్ధిదారులకు అందజేయనున్నట్టు తెలిపారు. కాపవరంలో సొంత ఇల్లు లేని పేదలకు త్వరలోనే ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. కోరుకొండ, కాపవరం గ్రామస్తుల కోసం ఎంపిక చేసిన ఇళ్ల స్థలాల విషయం కోర్టు వివాదంలో ఉండటంతో ఆలస్యమయ్యిందన్నారు. పేదలకు సొంత ఇల్లు ఇవ్వడాన్ని సహించలేని ప్రతిపక్ష నాయకులు కోర్టుల్లో కేసులు వేసిన కారణంగా జాప్యమవుతున్నట్టు తెలిపారు. కోర్టుల ద్వారా క్లియరెన్స్ రావడంతో ఈ నెలాఖరులో పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏర్పడటంతో రెండు రోజులుగా కోతలు ఉంటున్నాయన్నారు. అయితే రాజానగరం నియోజకవర్గంలో కోతలు నివారించాలని ఉన్నతాధికారులను కోరినట్టు తెలిపారు. కాపవరం అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.50 లక్షలు మాత్రమే కేటాయించగా, తమ ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించిందన్నారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను నిర్మించి సేవలందించడంతో పాటు, నాడు-నేడు పథకం ద్వారా విద్యాభివృద్ధి జరుగుతోందన్నారు.

ఓర్వలేక బాబు అండ్ కో నిందలు

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే చంద్రబాబు అండ్ కంపెనీ ప్రభుత్వంపై నిందలు వేస్తోందని దుయ్యబట్టారు. పల్లెల్లో సేవలందుబాటులో ఉంటూ ప్రజలకు సమస్యలే లేని గ్రామాలుగా తయారవుతుంటే నారా చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్ ఫ్రస్టేషన్‌తో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి అంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగడమే అన్నారు. కంటిచూపు లోపంతో వారు నిజాన్ని చూడలేరన్నారు. మా ప్రభుత్వంపై ప్రజల్లో అభిమానం, ఆదరణ సంతృప్తిగా ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సంక్షేమ పథకాలందుతున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే రాజాకు స్థానిక అక్కచెల్లెమ్మలు హారతులతో స్వాగతం పలికారు. గడప గడపకూ వెళ్లి సమస్యలు అడిగారు. సంక్షేమ పథకాలందుతున్న తీరు గురించి ఆరా తీశారు. స్థానికులు మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మరికొందరు ఎమ్మెల్యేను అర్థించారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సచివాలయం వీధి, శెట్టిబలిజ సామాజికవర్గం పేట, రామాలయం వీధుల్లోని 150 గడపలు తిరిగారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్ జాజుల రాము, ఉప సర్పంచ్ బయ్యే గనుకలమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో-కన్వీనర్ గణేశుల పోసి, కాపవరం ఎంపీటీసీ సభ్యుడు కాలచర్ల నాగు, యువజన విభాగం మండల కన్వీనర్ ఉల్లి గణ, స్థానిక నాయకులు కాలచర్ల శివాజీ, సానబోయిన మల్లేశ్వరి, బయ్యే దుర్గయ్య, శ్రీరంగం శ్రీను, భాను, సచివాలయం సెక్రటరీ షేక్ అన్వర్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో స్వచ్ఛమైన పాలన

- ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి
- పెదరాయవరంలో ప్రభుత్వ భవనాల ప్రారంభం


మండల పరిషత్ వద్ద రైతులకు మోటార్లు అందిస్తున్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో స్వచ్ఛమైన పాలనకు పునాది పడిందని ఎంపీ మార్గాని భరత్ అన్నారు. పెదరాయవరంలో అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు ఆధ్వర్యంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా, రూ. 20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ల భవనాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా మండల కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన తర్వాత ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. సచివాలయాల ద్వారా సుమారు 630 పైగా సేవలు అందిస్తూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదర్శ పాలనను సాగిస్తున్నారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ మాయమాటలు చెబుతున్నారని, అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి పేదవానికీ అనేక విధాలుగా మేలు జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆర్‌బీకేల ఏర్పాటుతో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు రైతులకు అవసరమైన సేవలన్నీ అందుతున్నాయన్నారు. రైతులకు వ్యవసాయంలో మెళకువలు నేర్పించేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడకుండా ప్రతి గ్రామంలో వెల్‌నెస్ సెంటర్లను సీఎం జగన్ ఏర్పాటు చేశారన్నారు. పెదరావరంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు ఒకేచోట నిర్మించారని ఎంపీ, ఎమ్మెల్యే కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చందన్న, పార్టీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, అనపర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ బరగటి సుజాత పాల్గొన్నారు.

రైతులకు వైఎస్సార్ జలకళ వరం

వైఎస్సార్ జలకళ పథకం రైతులకు వరం లాంటిదని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రంగంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ జలకళ పథకంలో మంజూరైన బోర్ల మోటార్లను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలసి ఆయన రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రైతులకు ఉచితంగా బోర్లు, మోటార్లను వైఎస్సార్ జలకళ పథకం ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. జిల్లాలో ఇంత వరకు 1,027 బోర్లు వేశారని, అందులో విద్యుత్తు కనెక్షన్లు పెట్టుకున్న సుమారు 300 మందికి ఉచితంగా మోటార్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో ప్రథమంగా నియోజకవర్గంలో 9 మంది రైతులకు మోటార్లు అందించామన్నారు. డ్వామా ఏపీడీ జి.శ్రీనివాస్, ఏపీఎం జి.వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ పోతుల బులి వీర్రాజు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

‘ఉత్తమ ఉపాధ్యాయ’ అవార్డుకు పేర్లు ఇవ్వండి


సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

రాజానగరం: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల నుంచి కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఒకరిని ఎంపిక చేసి, సెప్టెంబర్ 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. నరేంద్రపురంలో శుక్రవారం జరిగిన మండల ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో ఈ మేరకు దివాన్‌చెరువులోని పాఠశాల అధినేత వై.నాగేశ్వరరావు చేసిన సూచనకు అంతా ఆమోదం తెలిపారు. ఆసక్తి ఉన్న వారి పేర్లను పంపించాలన్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రతపై శ్రద్ధ


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

రాజానగరం: ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు తగిన శ్రద్ధ తీసుకోవాలని, అయితే కిషోర్ బాలికలు ఈ విషయంలో శరీరంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకుంటూ ఆరోగ్యం, పరిశుభ్రత పై కూడా దృష్టిని సారించాలని డాక్టర్ హేమనళినీ, హెచ్ఎం పి.నాగమణి సూచించారు. దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజానగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ‘ఆరోగ్యం-పరిశుభ్రత’ పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు వెలిబుచ్చిన సందేహాలను వారు నివృత్తి చేశారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, టీచర్స్ పాల్గొన్నారు.

శుభ్రతకు ప్రాధాన్యం ఇద్దాం

బిక్కవోలు: పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇద్దామంటూ పందలపాకలోని శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వచ్ఛ విద్యాలయ ప్రతిజ్ఞ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు ప్రతిజ్ఞ చేశారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల, వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. పీడీ యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు


కొంకుదురులో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

బిక్కవోలు: కొంకుదురు శివారులో మూలటాపు వద్ద శ్రీవిజయదుర్గమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆడపా సత్యవరప్రసాద్ వీరలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో అర్చకుడు రమణశర్మ, శిష్య బృందం మహిళలతో వరలక్ష్మీ వ్రతాలు చేయించారు. కొమరిపాలెం, తొస్సిపూడి, పందలపాక, ఊలపల్లి గ్రామాల్లోని ఆలయాల వద్ద కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

అనపర్తి: మండలంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శాంతిపురంలో వేంచేసి ఉన్న శ్రీగణపతి, సరస్వతీ సహిత మహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం సంతాన లక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు.

దేవీచౌక్ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: దేవీచౌక్ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. పవిత్ర శ్రావణ మాసంలో మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని వేలాది మందిఆలయానికి తరలివచ్చారు. అమ్మవారిని వెండి, బంగారం ఆభరణాలతో అలంకరించారు. సూర్రెడ్డి చిరంజీవి, రూపలక్ష్మి, పడాల సాయిబాబా రెడ్డి, హరిత దంపతులు అమ్మవారికి కాసు బంగారు శతమానాలు సమర్పించారు.

ఆలయాల్లో సందడి

సీతానగరం: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. సీతానగరంలోని శ్రీమహాలక్ష్మి, శ్రీవాసవి కన్యాకాపరమేశ్వరి, శ్రీధనమ్మ తల్లి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. సాయంత్రం మహిళలు ఆలయాల్లో పూజలు జరుపుకున్నారు. శ్రీరామనగరం వద్ద శ్రీఅమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. చినకొండేపూడి శ్రీమహాలక్ష్మి ఆలయం, సింగవరం నాగరత్నం కాలనీ వద్ద శ్రీదుర్గఅమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.